

... ఫోన్ మాయం చేస్తారు

బైక్‌పై నుంచి పడిపోతున్నట్లు నటిస్తూ సాయం చేసేందుకు వెళ్లే వారి సెల్‌ఫోన్‌లు మాయం చేస్తున్నారు.

8లో



కేరళలో డీసీసీబీ బృందం

కేరళ సహకార బ్యాంకులు రైతులకు అందిస్తున్న సేవలపై అధ్యయనం చేసేందుకు డీసీసీబీ బృందం ఆ రాష్ట్రానికి వెళ్లింది.

8లో

గరిష్టం / కనిష్టం

39° / 28°

వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘బెస్ట్ అవైలబుల్’లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో గిరిజన విద్యార్థులు 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమాభివృద్ధి శాఖ అధికారి ఎన్.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 23 సీట్లు, 5వ తరగతిలో 12, 8వ తరగతిలో 11 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులను వచ్చేనెల 12న ఖమ్మం బైపాస్‌రోడ్డు రామాలయం సమీపంలోని గిరిజన భవనంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని వివరించారు. జూన్ 6వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని, దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ జతపరిచి కొత్త కలెక్టరేట్‌లోని ఉపసంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఇకపై టీజీ డిస్కం

- టీఎస్‌ఎన్పీడీసీఎల్ టీజీఎన్పీడీసీఎల్‌గా మార్పు

ఖమ్మంవ్యవసాయం : విద్యుత్ పంపిణీ సంస్థ పేరులో మార్పు చేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ (టీఎస్ ఎన్పీడీసీఎల్) సంస్థగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నామకరణ చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పేరులో స్వల్ప మార్పు చేస్తూ తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ (టీజీ ఎన్పీడీసీఎల్) సంస్థగా నిర్ణయించింది. దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థకు కూడా టీజీ ఎస్పీడీసీఎల్‌గా నామకరణం చేశారు. సంస్థ నిర్వహణలో ఉన్న కార్యాలయాల బోర్డులను టీజీ ఎన్పీడీసీఎల్ పేరుతో ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఎస్‌ఈ సర్కిల్ కార్యాలయం మొదలు డీఈ, ఏడీఈ, ఏఏఈస్, ఏఈ ఆపరేషన్స్ కార్యాలయాలు టీజీ ఎన్పీడీసీఎల్ కార్యాలయాలుగా మారనున్నాయి.

జాతీయ స్థాయి పరుగు పందెంలో బంగారు పతకం



సాధించిన పతకాలతో సింహాద్రి

చింతకాని : ఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగు పందెంలో చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు సింహాద్రి బంగారు పతకం సాధించాడు. వరంగల్‌లోని అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ శిక్షణ పొందుతున్న సింహాద్రి.. ఈనెల 18 నుంచి ఢిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయిలో పరుగు పందెం పోటీలకు హాజరయ్యాడు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువకులతో పోటీపడి 1600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుని జూన్ 20 నుంచి నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యాడు. నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు వీరబాబు, దేవమణి దంపతుల కుమారుడు సింహాద్రి పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు. ప్రస్తుతం వరంగల్‌లోని అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ శిక్షణ పొందుతున్నాడు. జాతీయ స్థాయి పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన సింహాద్రిని గ్రామస్తులు అభినందించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలలో ప్రతిభ



గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సునీత

వైరా: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి పీఠం వారు ఏర్పాటు చేసిన భగవద్గీత కంఠస్థ ఆన్‌లైన్ పోటీల్లో వైరాకు చెందిన దోనేపూడి సునీత, రాయపూడి రజని, వేముల ఫణికుమారి పాల్గొని బంగారు పతకాలు సాధించారు. 186 పద్యాలు ఉచ్చరణ దోషాలు లేకుండా కమిటీ వారు అడిగిన శ్లోకాలు చెప్పి విజయం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. విజేతలను వైరా గీతా పారాయణం నిర్వాహకులు కొప్పురావూరి కృష్ణమూర్తి, కొప్పురావూరి రూప్సీ, కమిటీ సభ్యులు అభినందించారు.

విద్యావంతుల మౌనం తగదు..



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

భావితరాల గురించి ఆలోచించే నాయకుడు కావాలి

- ఖమ్మం సర్వాంగ సుందరంగా తయారైంది..
- పనే గీటురాయి అయితే ఇక్కడ బీఆర్‌ఎస్ గెలవాలి
- ఎమ్మెల్సీగా రాకేష్‌రెడ్డిని గెలిపించండి
- పట్టభద్రులకు మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు

ఖమ్మంసహకారనగర్: ‘భావి తరాల గురించి ఆలోచించే నాయకుడు కావాలి. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చాడు. అందరికీ తనవంతు సహకారం అందిస్తూ స్వతహాగా ఎదిగిన వ్యక్తి. విద్యాధికుల మౌనం.. విద్యావంతుల నిర్లిప్తత మంచిది కాదు. అందరూ ఓటింగ్‌లో పాల్గొనండి.. మీ అభిప్రాయాన్ని తెలియజేయండి’ అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాలోని పలు సంస్థల్లో పనిచేసిన వ్యక్తి రాకేష్‌రెడ్డి అని, అలాంటి విద్యాధికుడు శాసన మండలిలో ఉండాలని అన్నారు. బ్లాక్‌మెయిలర్లను ఎన్నుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి ఇస్తామన్నారని చెప్పారని, అవి ఉత్త మాటలేనని అన్నారు. తాము పదేళ్ల పాటు చాలా నిజాయితీగా పని చేశామని, ఖమ్మం నగరాన్ని సర్వాంగ సుందరంగా తయారుచేశామని అన్నారు. పనే గీటురాయి అయితే బీఆర్‌ఎస్ గెలవాల్సిందని అన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, అయితే పేపర్ లీకైందంటూ అడ్డగోలు ప్రచారం చేశారని అన్నారు. తెలంగాణలో ఇచ్చినన్ని ఉద్యోగాలు మరే రాష్ట్రంలోనైనా చూపిస్తారా అని ప్రశ్నించారు. ఆరు నెలల్లో ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని విమర్శించారు. ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారా.. రాత పరీక్ష పెట్టారా.. ఇంటర్వ్యూ చేశారా.. అని ప్రశ్నించారు. తాము ఖమ్మం, వరంగల్, నల్లగొండల్లో ఐటీ హబ్‌లు పెట్టామని చెప్పారు. టెక్ మహీంద్ర వంటి కంపెనీలను తమ ప్రభుత్వం తెస్తే నేడు అవి మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. కొత్త పరిశ్రమలను తెచ్చే తెలివి, ఉన్న పరిశ్రమలను నిలుపుకునే సత్తా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శాసనమండలిలో ప్రశ్నించేందుకు ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మేధావులనే మండలికి పంపాలి..

వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలు మేధావులు ఎక్కువగా ఉండే ప్రాంతాలని, పార్టీలు ఏవైనా పట్టభద్రులంతా గతంలో మంచి వ్యక్తులనే మండలికి పంపారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. మండలి అంటే పెద్దల సభ అని, అక్కడ మేధావులను ఎన్నుకుంటారే తప్ప.. మోసగాళ్లను కాదని అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ప్రజల తరఫున పోరాడతానన్నారు. బీజేపీలో చాలా ఏళ్లు పనిచేశానని, ఎన్నో పోరాటాలు చేశానని, కేసీఆర్ తనను పిలిచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే రూపాయి తీసుకోకుండా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తాను అసెంబ్లీకి ఎన్నిక కావడంతో రాజీనామా చేస్తే ఇప్పుడు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరుగుతోందని, నాడు ప్రశ్నించే గొంతుకను మండలికి పంపించారని, ఈ సారి కూడా రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్యారంటీలు అని చెబుతున్న వారిని నమ్మకుండా రైతు కుటుంబం నుంచి, ఐఐటీ బిట్స్ పిలానీలో గోల్డ్ మెడల్ సాధించి ప్రశ్నించే గొంతుగా ఉన్న రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్‌జేసీ కృష్ణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక రంగాల్లో అభివృద్ధి జరిగిందని, ఐటీ గణనీయంగా అభివృద్ధి సాధించిందని అన్నారు. ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చాయని, మొదట్లో నామమాత్రంగా ఉన్న ఐటీ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది ఈ రంగంలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా యువ నాయకుడు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సభలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, బచ్చు విజయ్‌కుమార్, ఖమర్, బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, శీలంశెట్టి వీరభద్రం, కర్నాటి కృష్ణ, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పట్టభద్రులు

గత ప్రభుత్వానికి భిన్నంగా పాలన



గువ్వలగూడెంలో పొంగులేటిపై పూలు చల్లుతున్న నాయకులు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా తమ పాలన సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగారం, సదాశివాపురం, పాత కొత్తూరు, నాచేపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. సమస్యలపై వినతులు స్వీకరించడంతో పాటు రైతులు, యువత, మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగా పైరవీలకు తావు లేకుండా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కక్షపూరితంగా పనులు కూడా ఆపేశారని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇళ్లు, పింఛన్‌లు, ఇంటి స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పాలేరు నియోజకవర్గాన్ని తన సొంత గ్రామంగా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని చెప్పారు. నీటి ఎద్దడి రాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో రాజీపడకుండా ముందుకు సాగుతామన్నారు. మొదటి దశలో నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని, వచ్చే మూడేళ్లలో అందరికీ పక్కా ఇళ్లు ఉండాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ సర్కారు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఎన్నికల కోడ్ ముగిశాక అర్హులను ఎంపిక చేస్తామని అన్నారు. విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల్లో ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, నల్లాని మల్లికార్జున్‌రావు, కె.హనుమంతరావు, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, భద్రయ్య, వెంకన్న, కడియాల నరేష్, మోహన్‌రెడ్డి, కొమ్మినేని విజయ్‌బాబు, రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, వడ్డె జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అండగా ఉంటా

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, పక్కన నాయకులు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం లీగల్ : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే అండగా ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో, కోర్టులో న్యాయవాదులతో మాట్లాడారు. పట్టభద్రులు, లాయర్లు తనకు మొదటి ప్రాధాన్యతగా ఓటేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా యువతకు అన్ని హామీలు నెరవేరేలా కృషి చేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, వెంకటస్వామి మాట్లాడుతూ.. పట్టభద్రులు ఎంతో విజ్ఞత గలవారని, ఎవరు ప్రతినిధిగా ఉంటే న్యాయం జరుగుతుందో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్‌తోనే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఏ అధికారం లేనప్పుడే ప్రజా సమస్యలపై మల్లన్న పోరాడారని, ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ప్రజా సమస్యలపై ఉద్యమించే సమర్థత గల నాయకుడని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావేద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నరసింహారావు, నాయకులు నాగ సీతారాములు, శ్రీనివాస్ యాదవ్, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, శేఖర్ గౌడ్, మలీదు వేంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, మదూరి ప్రసాదరావు, గజ్జి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడేది బీజేపీనే

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొడుతున్నారు
- ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించండి
- బీజేపీ నేత ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్రంలో ఎన్నికైన కొద్ది రోజుల్లోనే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఖమ్మంలో విలేకరులతో, ఆ తర్వాత పట్టభద్రులు, డాక్టర్లు, లాయర్లతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. తీన్మార్ మల్లన్నకు ఓటేస్తే రేవంత్‌రెడ్డి భజన చేస్తాడని, అదే ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రజా సమస్యలపై కొట్లాడుతాడని అన్నారు. రాష్ట్రంలో ఏ సమస్యపై అయినా చట్టసభల్లో, బయట కూడా పోరాడేది బీజేపీ ఒక్కటేనని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు మనుగడ లేదన్నారు. నిరుద్యోగ యువతకు రూ.4 వేలు ఇస్తామని సోనియా, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయాలని కొందరు మంత్రులు విద్యాసంస్థల యాజమాన్యాను బెదిరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, డాక్టర్ శీలం పాపారావు, అల్లిక అంజయ్య, సత్యనారాయణ యాదవ్, వాసుదేవరావు, విద్యాసాగర్, కోటేశ్వరరావు, చావా రవి, ఉప్పల శారద పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు ఆర్‌ఓ గౌతమ్ ఆదేశం

ఖమ్మం సహకారనగర్ : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లెక్కింపు విధుల సిబ్బందికి ఈ నెల 29న మొదటి విడత, జూన్ 2న రెండో విడత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తహసీల్దార్లను బాధ్యులుగా పెట్టాలని, లెక్కింపు పూర్తయిన ఈవీఎంలను గోడౌన్‌కు తరలించేందుకు డీజీటీ వాహనాలు సిద్ధంగా ఉంచాలని అన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ మధ్యాహ్నం 12.30 గంటల లోపు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు 40 ప్రాంతాల్లో 115 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ, అధికారులు శ్రీలత, శ్రీనివాస రెడ్డి, హరికిషన్, రాంగోపాల్ రెడ్డి, అరుణ, మదన్‌గోపాల్, మీనన్, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

రుణమాఫీపై కసరత్తు..

- 2019 ఏప్రిల్ 1 నుంచి తీసుకున్న వారికి వర్తింపు
- గతేడాది డిసెంబర్ 10 వరకు కటాఫ్
- సమాచారం ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశాలు
- అర్హత, మార్గదర్శకాలపై సర్వత్రా ఉత్కంఠ



ఖమ్మంవ్యవసాయం: పంట రుణాల మాఫీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.2 లక్షల వరకు పంటరుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇక ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ పంట రుణాల మాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి మరింత స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రుణమాఫీ ఎప్పటి నుంచి ఎప్పటివరకు అనే అంశంపై స్పష్టత ఇచ్చింది. అంతేగాక నిర్దేశించిన కాలంలో పంట రుణాలు తీసుకున్న రైతుల సమాచారాన్ని తయారు చేయాలని బ్యాంకర్లకు దిశానిర్దేశం చేసింది. అయితే పంట రుణాల మాఫీలో లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు రూపొందించలేదు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పంట రుణాల మాఫీ, తిరిగి కొత్త రుణాలు, పంటల సాగు వంటి వాటిపై రైతులు ఆశల పల్లకీలో ఉన్నారు. జిల్లాలో ప్రతి ఏటా 7.03 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో 4.75 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తుండగా, వీరిలో దాదాపు లక్ష మంది కౌలు రైతులు కూడా ఉన్నారు.

కటాఫ్ నిర్దేశించిన ప్రభుత్వం..

పంటల రుణమాఫీ కాలాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబర్ 10వ తేదీ వరకు తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించేలా కాలాన్ని గుర్తించింది. ఈ కాలంలో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులు ప్రతి ఏడాది తీసుకున్న రుణాలు రెన్యువల్ చేసుకుంటూ, కొత్త రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు. బ్యాంకులు కూడా ఏటా వడ్డీలను జమ చేసుకోవడం, కొంత రుణాన్ని పెంచి ఇవ్వటం చేస్తున్నాయి. జిల్లాలో ప్రతి ఏటా వానాకాలం, యాసంగి పంట రుణాలుగా రూ. 2,400 కోట్ల వరకు ఇస్తుంటాయి. మొత్తంగా దాదాపు 3.75 లక్షల మంది రైతులు పంట రుణాలు పొందుతున్నారు.

వివరాలు ఇవ్వండి..

నిర్దేశించిన కాలంలో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు పొందిన రైతుల వివరాలు తయారు చేయాలని ప్రభుత్వం బ్యాంకర్లను ఆదేశించింది. జిల్లాలో పంట రుణాలు ఇచ్చే బ్యాంకులు 17 ఉండగా, ఈ బ్యాంకుల బ్రాంచీల ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ), ఏపీజీవీబీ, ఎస్‌బీఐ, ఇండియన్ యూనియన్ బ్యాంక్ తదితర బ్యాంకులు పంట రుణాలు ఇస్తున్నాయి. జిల్లాలో ఉన్న ఆయా బ్యాంకుల 300 బ్రాంచీలు పంట రుణాల జాబితాలను తయారు చేస్తున్నాయి.

అర్హత, మార్గదర్శకాలపై ఉత్కంఠ..

పంట రుణాల మాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చినప్పటికీ ఇంకా మార్గదర్శకాలు రూపొందలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ కొనసాగుతున్న క్రమంలో మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉండదనే చర్చ జరుగుతోంది. రుణమాఫీ వ్యవహారంలో ప్రభుత్వం అర్హతలు, మార్గదర్శకాలను రూపొందించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ అమలు చేసినప్పుడు కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తింప చేసేలా మార్గదర్శకాలు రూపొందించింది. ప్రస్తుత ప్రభుత్వం అర్హతలను వెల్లడించాల్సి ఉంది. దీంతో అర్హతలు, మార్గదర్శకాలపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. కొందరు రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొంది, ప్రభుత్వాలు మాఫీ అనడంతో కనీసం రెన్యువల్ కూడా చేయించుకోకుండా తమకు మాఫీ వర్తిస్తుందని ఆశగా ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది.

వారి పరిస్థితి ఏంటి?

గత ప్రభుత్వం రూ.లక్ష లోపు పంట రుణాల మాఫీ పథకాన్ని అమలు చేసింది. 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 11 వరకు కుటుంబంలో ఒకరికి రూ.లక్ష లోపు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసేలా మార్గదర్శకాలకు రూపొందించింది. ఆ సమయాన జిల్లాలో 3.25 లక్షల మంది రైతులు రూ.2,428 కోట్ల పంట రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఈ మొత్తం రైతుల్లో అర్హులైన వారికి నాలుగు విడతలుగా రూ.25 వేల నుంచి రూ. లక్ష వరకు తీసుకున్న వారికి మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో నాలుగు విడతల్లో 1,11,962 మంది రైతులకు చెందిన రూ. 510.63 కోట్లు మాఫీ చేసింది. ఇంకా జిల్లాలో 2 లక్షల మందికి పైగా రైతులకు చెందిన రూ.2 వేల కోట్ల వరకు మాఫీ జరగాల్సి ఉంది. ఈ ప్రక్రియలో అర్హులైన రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూసి పెద్ద సంఖ్యలో రెన్యువల్ కూడా చేసుకోలేదు. దీంతో ఆయా రైతులకు ప్రస్తుతం రుణమాఫీ ప్రక్రియ వర్తిస్తుందా, లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

క్లుప్తంగా

అర్హతకు మించి వైద్యసేవలు అందిస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్



ప్రథమ చికిత్స కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో స్థాయికి మించి వైద్య సేవలు, బెడ్ల ఏర్పాటు, అనుమతి లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారని డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం నేలకొండపల్లిలోని ప్రథమ చికిత్స కేంద్రాల్లో తనిఖీలు చేశారు. బెడ్లు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి బెడ్లను తీయించారు. పలు ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాద్ మాట్లాడారు.. ప్రథమ చికిత్స కేంద్రాల్లో అర్హతకు మించి వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఎంపీలు నర్సింగ్ హోం బోర్డులు, క్లినికల్ అనే బోర్డులు ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శిగా సాంబమూర్తి



ఓలేటి సాంబమూర్తి

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా ఒలింపిక్ సంఘం నూతన సంయుక్త కార్యదర్శిగా టేబుల్ టెన్నిస్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తిని ఎన్నుకున్నారు. ఆయన ఎంపికపై టేబుల్ టెన్నిస్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, కొండా శ్రీధర్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సుమంత్, రాయల సతీశ్‌బాబు, పరిటాల చలపతి, ఉపేందర్ అభినందనలు తెలిపారు.

జిమ్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాయామం



వర్కవుట్ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని క్లాసిక్ జిమ్‌లో రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాయామం చేశారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ముందుగా సర్దార్ పటేల్ స్టేడియంలో వాకింగ్ చేసిన ఆయన జిమ్‌లో వర్కవుట్ చేశారు. కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు మనోజ్‌కుమార్, నగీన పాల్గొన్నారు.

కేఎఫ్‌సీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



కిచెన్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

ఖమ్మంమయూరి సెంటర్: నగరంలోని కేఎఫ్‌సీలో సోమవారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. కిచెన్‌లో వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చికెన్ డ్రమ్‌స్టిక్స్, చికెన్ పాప్‌కార్న్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం, రేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను సోమవారం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ నెలాఖరులోగా పాఠశాలల్లో విద్యుత్, గోడలకు రంగులు, మరుగుదొడ్ల మరమ్మతుల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆర్.నాగేశ్వరరావు, ఎంఈఓ బి.రాములు, ఆర్‌అండ్‌బీ ఏఈలు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎంలు ఉన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

సాయం కోరి.. ఫోన్ మాయం చేస్తారు..

- బైక్ పైనుంచి పడిపోతున్నట్లు నటన
- సాయం చేసేందుకు వచ్చేవారి సెల్‌ఫోన్ల చోరీ
- ఆందోళన చెందుతున్న ప్రజలు



సెల్‌ఫోన్ చోరీ చేసి ఒకే బైక్‌పై వెళ్తున్న దుండగులు

సత్తుపల్లి: సెల్‌ఫోన్లు అపహరించేందుకు ఇద్దరు ఆగంతకులు కొత్త రకంగా ఆలోచించారు. ద్విచక్రవాహనం పైనుంచి పడిపోతున్నట్లు నటించి.. పట్టుకోండి.. పట్టుకోండి.. అని అరుస్తున్నారు. సాయం చేద్దామని వెళ్లేవారి జేబుల్లో నుంచి మరో వ్యక్తి వచ్చి సెల్‌ఫోన్ కొట్టేసి పారిపోవడం వారి ప్లాన్‌లో భాగంగా ఇలా పదుల సంఖ్యలో చోరీలకు పాల్పడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎరుపు రంగు హోండా ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట నుంచి ఖమ్మం వరకు తిరుగుతూ సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఎంతో చాకచక్యంగా..

రెండు, మూడు నెలల నుంచి ఇద్దరు యువకులు ఈ తరహా దొంగతనాలకు పాల్పడటం చర్చనీయాంశమైంది. సెల్‌ఫోన్ అపహరించేందుకు టార్గెట్ ఫిక్స్ చేసుకొని ఓ ఆగంతకుడు ముందుగా కొద్ది దూరంలో నిల్చొని పరిసరాలను గమనిస్తూ ఉంటాడు. ఇంతలో మోటారు సైకిల్‌పై వచ్చిన యువకుడు కిందపడుతున్నట్లు నటిస్తుంటే ఆ సమయంలో సహాయం చేసేందుకు ఎవరైనా వ్యక్తి ముందుకు వస్తే అప్పటి వరకు దూరం నుంచి గమనిస్తున్న వ్యక్తి హడావుడిగా వచ్చినట్లు వచ్చి సహాయం చేయటానికి వచ్చిన వ్యక్తి జేబులో నుంచి సెల్‌ఫోన్ కొట్టేసి.. మోటారు సైకిల్‌ను పైకిలేపుతున్నట్టు నటిస్తూ.. కిందపడుతున్న వ్యక్తిని మోటారు సైకిల్‌పై ఎక్కించి ఇద్దరూ కలిసి పారిపోతారు. తర్వాత చూసుకుంటే సహాయం చేసిన వ్యక్తి జేబులో నుంచి సెల్‌ఫోన్ చోరీకి గురై ఉంటుంది.



సత్తుపల్లిలో సీసీ కెమెరాకు చిక్కిన వ్యక్తులు

సీసీ కెమెరాలకు చిక్కినా..

ఎరుపురంగు మోటారు సైకిల్‌పై తిరుగుతూ సెల్‌ఫోన్ చోరీ చేస్తున్నట్లు పలుచోట్ల సీసీ కెమెరాలకు చిక్కినా ఆ ఇద్దరు ఆగంతకులు పోలీసులకు చిక్కకుండా సవాల్ విసురుతున్నారు. సోషల్ మీడియాలో సీసీ కెమెరాలో చిక్కిన ఆ ఆగంతకులను చూసి వీళ్లే దొంగలంటూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వినియోగదారులు లబోదిబోమంటున్నారు. సత్తుపల్లిలో ఓసారి దొంగతనం చేస్తే తిరిగి నెల రోజుల వరకు అక్కడ చేయకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో దొంగతనాలు చేసినా ఆ దుండగులు ఎక్కడా చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఈ ముఠా ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ ఇద్దరిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సెల్‌ఫోన్ దొంగల ఆట కట్టిస్తామని సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ తెలిపారు.

రైతు బాంధవుడు 'రాయల'



శేషగిరిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

తల్లాడ: రైతాంగం సమస్యల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన నాయకుడు రాయల వెంకటశేషగిరిరావు అని, ఆయన ఆశయ సాధన కోసం బీఆర్‌ఎస్ కృషి చేస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాయల శేషగిరిరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భార్య పద్మావతి, కుమారులను ఓదార్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శేషగిరిరావు తొలి ఎంపీపీగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా పని చేసి ప్రజల మన్ననలను చూరగొన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్‌కుమార్, రేగా కాంతారావు, రాకేశ్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దిరిశాల ప్రమీల, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దిరిశాల దాసురావు, డి.వెంకట్‌లాల్, నాయుడు శ్రీనివాసరావు, కేతినేని చలపతిరావు, మువ్వా మురళి, అయిలూరి ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కేయూ వీసీపై సీబీఐ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగుల అక్రమ బదిలీలు, నియామకాలు, అక్రమ ప్రాజెక్టుల ఆమోదం తదితర అంశాలపై విజిలెన్స్ దాడులకు ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో నివేదికను బహిర్గతం చేయాలని, దీంతో పాటు వీసీ రమేశ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గిరిప్రసాద్‌భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ వీసీగా 2021 మేలో బాధ్యతలు చేపట్టిన తాటికొండ రమేశ్ ప్రొఫెసర్‌గా పదేళ్ల అనుభవం లేకున్నా పైరవీలతో వీసీగా పదవి పొందారని, అప్పటి రిజిస్ట్రార్ శ్రీనివాసరావుతో కలిసి ప్రొఫెసర్ల ప్రమోషన్లలో అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు వచ్చాయని ఆరోపించారు. యూనివర్సిటీ భూములను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమిస్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరించారని, ఫేక్ ప్రాజెక్టుల పేరిట డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో శివ, చందూలాల్, నవీన్, నరేశ్, సతీశ్ పాల్గొన్నారు.

లోడింగ్ పెంచే వరకు లారీలు కదలవు



సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

సత్తుపల్లి: సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఇచ్చి.. లోడింగ్ పెంచే వరకు లారీలు ఇక్కడి నుంచి కదలవని లారీ యజమానుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేశ్‌రెడ్డి, ఎస్కే కీజర్ స్పష్టంచేశారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో సోమవారం లారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించినా స్థానిక లారీలకు లోడింగ్‌లు పెంచటం విషయమై సింగరేణి అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. 40 శాతం లోడింగ్ ఇచ్చే వరకు ఆందోళనలు కొనసాగిద్దామని తీర్మానించారు. సత్తుపల్లి కాంగ్రెస్ నేత ఉడతనేని అప్పారావు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్కే లియాఖత్, కోటిరెడ్డి, ఎస్కే మునీర్ పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో బృందం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావును కలిసేందుకు హైదరాబాద్ వెళ్లింది.

కేరళ సహకార రంగంపై అధ్యయనం

23 వరకు డీసీసీబీ పాలకవర్గం స్టడీ టూర్



కేరళలోని సహకార బ్యాంకులో అధ్యయనం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గం కేరళ సహకార రంగంపై అధ్యయనం చేసేందుకు ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు విజ్ఞానయాత్ర సాగిస్తోంది. కేరళ బ్యాంకులకు అనుబంధంగా ఉన్న మున్నారు కో–ఆపరేటివ్ బ్యాంకును బృందం సందర్శించింది. హెచ్‌ఆర్ పాలసీలు, వివిధ రకాల రుణ పథకాలు, డిపాజిట్ స్కీంలు, వడ్డీరేట్లు, ఇతర సేవా కార్యక్రమాలు, రైతులకు మేలు జరిగే అంశాలను అధ్యయనం చేసింది. కేరళ రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న రెండంచెల సహకార వ్యవస్థపై కూడా బృందం అధ్యయనం చేస్తోంది. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. కేరళలో అమలు జరుగుతున్న సహకార విధానాలు రైతులకు ప్రయోజనం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. నాబార్డ్ సహకారంతో టస్కాబ్, సీటీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్రలో డీసీసీబీ ప్రతినిధులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, కృష్ణయ్య, చావా వేణు, మేకల మల్లిబాబు యాదవ్, నిర్మల పుల్లారావు, బోబోలు లక్ష్మణ్‌రావు, జనగం కోటేశ్వరరావు, పేరబత్తిని ప్రసాద్, నూకల సైదులు, మోదుగు పల్లారావు, డీజీఎం కిరణ్, ఏజీఎం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించండి



మాట్లాడుతున్న డీఆర్వో రాజేశ్వరి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి (వచ్చే నెల) జూన్ 3 వరకు జరుగుతాయని, వీటి నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 42 సెంటర్లలో ఉదయం, సాయంత్రం పరీక్షలు జరుగుతాయని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం 10,352 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 4,632 మంది విద్యార్థులు హాజరవుతారని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని, ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఉంటారని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వినోద్, డీఐఈఓ రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుపతికి..



కాలినడకన తిరుపతికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: గతేడాది అక్టోబర్‌లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రివర్గంలో మల్లు భట్టి విక్రమార్క ఉండాలని కోరుకున్న మండల కాంగ్రెస్ నాయకులు.. తమ కోరిక నెరవేరితే కాలినడకన తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకుంటామని శ్రీ వేంకటేశ్వరుడిని వేడుకున్నారు. తమ కోరిక తీరడంతో పార్టీ నేతలు తల్లపురెడ్డి నాగిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి సోమవారం జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం నుంచి కాలినకడన తిరుమల బయలుదేరారు. తొలుత జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి తోడుగా కర్నాటి అంజిరెడ్డి, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి కూడా కాలినడకన వెళ్లారు. తొలిరోజు 28 కి.మీ. నడిచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చేరుకున్నారు. వీరి పాదయాత్రకు పలువురు సంఘీభావం తెలిపారు.

ఆరుగురిపై చీటింగ్ కేసు

ఖమ్మంక్రైం: నకిలీ ధ్రువపత్రాలతో పలువురి ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న టీఎన్జీవోస్ అధ్యక్షుడు, మరో ఐదుగురిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. విజయనగర్‌కాలనీలో ఉన్న బాణాల శ్రీదేవితోపాటు మరికొంతమందికి చెందిన ప్లాట్లను నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారం బయట పడటంతో బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మోయిజ్‌అలీ సాయం చేయగా అఫ్జల్ హసన్ తోపాటు షేక్ మైబూ, నౌషద్‌ఖాన్, షేక్ సాహిబాసుల్తానా, రావులపల్లి రవిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. వీరు పరారీలో ఉన్నారని సీఐ వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు సోమవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. మామిళ్లగూడెంలోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి రూ.లక్షకు పైగా నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నవారిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని సీఐ వివరించారు.

టెట్ ప్రారంభం



ఎస్‌బిఐటీ కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్ : టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) సోమవారం ప్రారంభమైంది. జిల్లాలోని పలు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ పరీక్షలు జరిగాయి. అభ్యర్థులను పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతించగా.. నిమిషం నిబంధన అమలు చేశారు. జిల్లాలో 8 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం కలిపి 1,320 మందికి గాను 1,260 మంది హాజరు కాగా 60 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మార్కెట్ సెలవులపై సందిగ్ధం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వేసవి సెలవుల కొనసాగింపు వ్యవహారం సందిగ్ధంలో పడింది. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించాలని మే నెల మొదటి వారంలో కార్మికులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మార్కెట్ కమిటీని అభ్యర్థించారు. మార్కెట్ వర్గాల అభ్యర్థన మేరకు మే 14 నుంచి జూన్ 5వ తేదీ వరకు వేసవి సెలవులకు అనుమతించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిని కోరారు. జిల్లా కలెక్టర్ మే 11 నుంచి 20వ తేదీ వరకు మార్కెట్ సెలవులకు అనుమతించారు. దీంతో మే 21 మంగళవారం నుంచి మార్కెట్‌లో పంటల క్రయవిక్రయాలు జరగాల్సి ఉంది. అయితే చాంబర్ ఆఫ్ కామర్స్, కార్మిక ప్రతినిధులు సెలవులను కొనసాగించాలని మరోసారి అభ్యర్థించారు. దీనిని మార్కెట్ కార్యదర్శి జిల్లా కలెక్టర్ ముందుంచారు. అయితే కలెక్టర్ నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. దీంతో మంగళవారం నుంచి మార్కెట్‌లో పంటల కొనుగోళ్ల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది.

తల్లి, పిల్లలను చంపిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు వెంకటేశ్వర్లు

తల్లాడ: రెండో భార్య మోజులో పడి.. కనిపెంచిన తల్లి, రక్తం పంచుకొని పుట్టిన ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన నిందితుడు పిట్టల వెంకటేశ్వర్లును వైరా సీఐ సాగర్ అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గోపాలపేట గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తల్లాడకు చెందిన గూడె త్రివేణితో వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడు. భార్య కనకదుర్గ కొంతకాలం కిందట మృతిచెందగా ఇద్దరు ఆడపిల్లలు ఉండటంతో వెంకటేశ్వర్లుపై అనుమానం ఉన్నప్పటికీ వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిలో అరఎకరం తల్లిపేరుపై, అర ఎకరం పిల్లల పేరుపై పెద్దమనుషులు రాయించారు. నాలుగు నెలల తర్వాత త్రివేణిని వివాహం ఖమ్మం వెళ్లాడు. ఆర్థిక ఇబ్బందులతో త్రివేణికి, వెంకటేశ్వర్లుకు మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. తల్లి, పిల్లలను చంపితే ఆస్తి వస్తుందని భావించిన వెంకటేశ్వర్లు ఈ నెల 17న అర్ధరాత్రి ఖమ్మం నుంచి గోపాల పేట వచ్చి తల్లి పిచ్చమ్మ, కుమార్తెలు నీరజ, ఝాన్సీల ముఖాలపై దిండు అదిమి, గొంతు నులిమి హత్యచేశాడు. తిరిగి బస్సులో ఖమ్మం వెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి వైరా సీఐ సాగర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి రెండో భార్య త్రివేణితో కలిసి అత్తగారి ఊరైన సత్తుపల్లి వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సాగర్ ఆధ్వర్యంలో వారిని రిమాండ్‌కు తరలించారు.

పిడుగుపాటుతో పశువులు మృతి

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి, రావికంపాడు గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి పిడుగు పడటంతో రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. పెద్దకోరుకొండికి చెందిన వినుకొండ దానియేలు ఇటీవల రూ.80 వేలతో ఎద్దును కొనుగోలు చేయగా.. అది మేత కోసం చేలలోకి వెళ్లింది. ఆదివారం సాయంత్రానికి ఇంటికి రావాల్సిన ఎద్దు సోమవారం ఉదయం వరకు కూడా రాలేదు. దీంతో చేలల్లో పరిశీలించగా వెన్నవల్లి రోడ్డు పక్కన గల ఒక మామిడి తోటలో ఎద్దు మృతిచెంది ఉంది. రావికంపాడు గ్రామానికి చెందిన వలేబోయిన సత్యనారాయణకు చెందిన ఆవు కూడా పిడుగుపాటుతో మృత్యువాతకు గురైంది. దీని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని అంచనా. పిడుగుపాటుకు పశువులు చనిపోయాయని వెటర్నరీ శాఖకు సోమవారం ఫిర్యాదు చేయగా పశు వైద్యులు వెళ్లి పోస్టుమార్టం నిర్వహించారు. బోడిమెల్ల వద్ద చంద్రుపట్ల గ్రామానికి చెందిన నెల్లూరు పుల్లయ్యకు చెందిన బావి వద్ద సోమవారం ఉదయం గేదె చనిపోయిన విషయాన్ని పరిసర ప్రాంతాల రైతులు గుర్తించి సమాచారం అందించారు. ఈ గేదె కూడా పిడుగుపాటు వల్ల చనిపోయిందని భావిస్తున్నారు.

గొర్రెల మృతిపై విచారణ



గొర్రెల కాపరులతో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి నారాయణ

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారం గ్రామంలో ఇటీవల గడ్డి మందు పిచికారీ చేసిన పెసర పంటను మేసిన గొర్రెలు మృతిచెందిన సమాచారం తెలుసుకున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కేవీ నారాయణ సోమవారం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డి మందు మేసిన మిగతా గొర్రెల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 200 గొర్రెలు మృతిచెందగా మిగిలిన 800 గొర్రెలకు పశువైద్య సిబ్బంది వైద్య సేవలు అందించి కాపాడినట్లు గొర్రెల కాపారులు తెలిపారు. జీవాలను మేపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, జీవాలు అనారోగ్యం బారిన పడితే వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండల పశువైద్యాధికారి అనూష, గోపాలమిత్ర తూమాటి శ్రీను వైద్య సిబ్బంది అక్బర్‌పాషా, నాగమణి, బాబూరావు, కరుణాకర్, మహేశ్, సురేశ్, గొర్రెల కాపారులు పేర్ల బయ్యన్న, లింగయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకానగర్‌కు చెందిన రాచబంటి పద్మకు చెందిన పాడి గేదెలను మేత కోసం రిజర్వాయర్ ప్రాంతానికి వదిలారు. రిజర్వాయర్ ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం వద్ద ఎర్త్ వైరు తగిలి రెండు పాడి గేదెలు సోమవారం మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.